ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 5 జనవరి 2025



నేడే ముగ్గుల పోటీలు

సిద్ధమైన వేదికలు

● ఉదయం 10 గంటల నుంచి

తిరుపతిలో: నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానం(స్విమ్స్ సర్కిల్)
చిత్తూరులో: పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, గాంధీబొమ్మ దగ్గర
మదనపల్లెలో: జడ్పీ హైస్కూల్ ఆవరణ, ఆర్టీసీ బస్టాండు దగ్గర

తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేదికలు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం తిరుపతి, చిత్తూరు, మదనపల్లె పట్టణాల్లో పోటీలు జరుగుతాయి. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ప్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరుగుతాయి. తిరుపతి నగరంలో నెహ్రూ మున్సిపల్ స్కూల్ మైదానం(స్విమ్స్ సర్కిల్), చిత్తూరులో పీసీఆర్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్ (గాంధీబొమ్మ సమీపం), మదనపల్లె జడ్పీహైస్కూల్ గ్రౌండ్‌లో (ఆర్టీసీ బస్టాండు దగ్గర)ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మైదానాల్లో ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. తిరుపతిలో జరిగే పోటీలకు చిల్లీస్ రెస్టారెంట్స్ అధినేత అంజి లోకల్ స్పాన్సర్‌గా ఉన్నారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఎన్ మౌర్య ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. చిత్తూరులో జరిగే పోటీలను జీజేఎం ట్రస్టు, సుఖీభవ కళ్యాణ మండపాలు స్పాన్సర్ చేస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేయనున్నారు. మదనపల్లెలో జరిగే పోటీలకు శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కాలేజ్, ఆర్కే జ్యువెలర్స్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారు. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. వీటితో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి.



స్వీట్స్, ఫ్రూట్స్‌తో వెంకటేశ్వరస్వామికి అలంకారం

అలంకారప్రియుడు

వెంకటగిరిటౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరహర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని ఆలయ నిర్వాహకులు ఢిల్లీబాబు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. పలు రకాల స్వీట్లు, పండ్లతో చేసిన అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది. స్వామి వారికి నిర్వహించిన తిరుప్పావడ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తిరుమలలో జాన్వీ కపూర్

తిరుమల, జనవరి4(ఆంధ్రజ్యోతి): నటి శ్రీదేవి కుమార్తె, హీరోయిన్ జాన్వీ కపూర్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి మార్గంలో కాలినడకన శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్నేహితుడు శిఖర్‌తో కలిసి ఆలయంలోకి వెళ్లారు.ఆలయం ముందు జాన్వీ కపూర్‌తో సెల్ఫీలకు అభిమానులు వెంటబడ్డారు. కాగా, జాన్వీ కపూర్ తన సోషల్ మీడియా అకౌంట్లలో శ్రీవారి లడ్డూ తింటున్న ఫొటోను పోస్ట్ చేశారు. ఇది తెగ వైరల్ అవుతోంది.

■ ఇంటర్వ్యూ

రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ విలువలు సవరిస్తున్నారు. కొన్ని చోట్ల పెరిగితే, కొన్ని చోట్ల తగ్గుతుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తయింది. నిజానికి జనవరి ఒకటి నుంచే మారిన విలువలు అమలులోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించినా వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో వాయిదా పడింది. వైసీపీ ప్రభుత్వంలోలా అడ్డగోలుగా పెంచడం కాకుండా, వాస్తవ పరిస్థితుల ఆధారంగా విలువల సవరణ ఉంటుందని తెలుస్తోంది. విలువల సవరణతో జిల్లాకు నెలకు రూ.45 కోట్లు అదనపు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కసరత్తు ఎలా జరిగింది.. ఎంతదాకా వచ్చిందీ.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ తిరుపతి బాలాజీ జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వివరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రిజిస్ట్రేషన్ విలువ 20శాతం పైన పెంచలేదు

● కొన్ని మండలాల్లోనే పెరుగుదల
● కొన్ని చోట్ల తగ్గింపు ● అపార్ట్‌మెంట్ల జోలికి పోలేదు

అభివృద్ధి, మౌళిక వసతులే ప్రామాణికంగా...

తిరుపతి జిల్లాలో భూముల విలువల సవరణకు జాయింట్ కలెక్టర్ కమిటీకి ప్రతిపాదనలు సమర్పించాం. కొత్త ధరలకు సంబంధించిన కసరత్తు పూర్తి అయ్యింది. ఎక్కడైతే కొత్తగా లేఅవుట్లు, నిర్మాణాలు వస్తున్నాయో అక్కడ మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. అభివృద్ధి, మౌళిక వసతులను దృష్టిలో ఉంచుకుని ధరలు నిర్ణయించడం జరిగింది.

20 శాతంపైన పెంచలేదు

జిల్లాలో ఎలక్ట్రానిక్ క్లస్టర్స్ ఉన్న చోట భూములకు మంచి మార్కెట్ ఉంటుంది.జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ రోడ్ల పక్కన భూములకు కూడా మంచి డిమాండు ఉంటుంది. పండుగ తర్వాత కొత్త లేఅవుట్లు ఎక్కువగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. మంచి కోర్ ఏరియాలో కూడా 20 శాతంకన్నా తక్కువగానే ,ధరల సవరణ చేశాం.

ఆ 7 మండలాలే ప్రధానం


తిరుపతి నగరంలో వాణిజ్య, మాస్టర్ ప్లాన్ రోడ్లున్న ప్రాంతాల్లో భూముల విలువలను సవరించాం.తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, చంద్రగిరి మండలాల నుంచి 70 శాతం రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వస్తుంది.మిగిలిన 30శాతం ఇతర మండలాల నుంచి వస్తుంది. 70శాతంలో కూడా తిరుపతి రూరల్, రేణిగుంట మండలాల నుంచి 55శాతం ఆదాయం వస్తుంది. అందువల్ల ఈ మండలాలపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నాం.

తిరుపతిలో ఇలా చేశాం..

తిరుపతి నగరంలో అపార్టమెంట్ల విలువ పెంచలేదు. అదేవిధంగా 19, 20 డివిజన్ల పరిధిలో ప్రస్తుతం ఆస్తుల విలువ ఎక్కువగానే ఉండడంతో వాటిని కూడా సవరించలేదు. ఇక 1 నుంచి 17 డివిజన్ల వరకు చదరపు గజానికి వెయ్యి రూపాయలు, 21 నుంచి 23 డివిజన్లలో ప్రస్తుతం ఉన్న విలువకు 20 శాతం పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు స్వీకరిస్తాం. కమిటీ ముందు పెట్టి రివిజన్ చేస్తాం.

మూడు గ్రూపులుగా వ్యవసాయ భూములు

ఇప్పటివరకు వ్యవసాయ భూములకు ఒకేవిధంగా రిజిస్ట్రేషన్ విలువ ఉండేది. ఈసారి వాటిని మూడు రకాలుగా వర్గీకరిస్తున్నాం. జిల్లాలో పండ్లు (మామిడి, నిమ్మ తదితరవి), పూల (మల్లె, బంతి, చామంతి)సాగు ఎక్కువగా ఉంటుంది. వీటిని గార్డెన్ కింద తొలి ప్రాధాన్యతగా తీసుకున్నాం. ఆ తర్వాత మాగాణి భూములు, చివరగా మెట్ట (డ్రై) భూములను తీసుకుంటున్నాం. విలువ సవరణలో గార్డెన్, మాగాణి, మెట్ట మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఒక సర్వే నంబరు వర్గీకరణ మారితే, దానినే పరిగణనలోకి తీసుకుంటాం. పక్కన మాగాణి ధర మామూలుగానే ఉంటుంది. ఓ పది ఎకరాల వ్యవసాయ తోటలో వంద అంకణాల ఇళ్లు ఉంటే గార్డెన్‌కుండే విలువ, రెసిడెన్షియల్ విలువ వేరుగా ఉంటుంది.



శ్రీరామ్‌కుమార్

పండుగలా..

● ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభం
● వెంకటగిరిలో విద్యార్థులతో కలసి భోంచేసిన కలెక్టర్
● పాపానాయుడుపేటలో వడ్డించిన నరసింహ యాదవ్



విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

తిరుపతి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శనివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. జిల్లాలో మొత్తం 21ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా వాటిలో 5,759మంది విద్యార్థులు చదువుతున్నారు. వెంకటగిరి పట్టణం విశోదయా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలెక్టర్ వెంకటేశ్వర్ స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియల తో కలసి పథకాన్ని ప్రారంభించారు.ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాన్ని సద్వినియోగం చేసుకుని చదువులపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానీ పాల్గొని పథకానికి శ్రీకారం చుట్టారు.గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రారంభించగా, సూళ్లూరుపేట నియోజకవర్గంలో సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాయుడుపేట పెనల గుర్రప్ప శెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అక్కడి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించగా వైసీపీ జడ్పీటీసీ వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు. రేణిగుంట జడ్పీ హైస్కూలు ప్లస్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొని ఆరంభించారు. ఆయన పిల్లలకు భోజనం వడ్డించడంతో పాటు వారితో కలసి భోజనం చేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ పాల్గొని పథకాన్ని మొదలుపెట్టారు.తిరుపతి రీజనల్ ఇంటర్మీడియట్ అధికారి జీ.వి.ప్రభాకర్‌రెడ్డి ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు.కాగా ఇప్పటివరకూ కేవలం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కూడా వర్తింపజేయడం, శనివారం పథకాన్ని ప్రారంభించడంతో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో సందడి వాతావరణం నెలకొంది.

ముక్కంటి ఆలయ అతిథిగృహంలో

అసాంఘిక కార్యకలాపాలు

● సొంత అడ్డాగా మార్చుకున్న ఒప్పంద ఉద్యోగి కుమారుడు
● మద్యం తాగుతూ, మాంసం తింటూ చిందులు ● ఇద్దరు ఒప్పంద ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు




అతిథిగృహం గదిలో మందు సీసాలు - మోహన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన వరదరాజస్వామి అతిథిగృహంలో కొందరు యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డారు. మద్యం తాగుతూ, మాంసం తింటూ చిందులేశారు. వారి ఆగడాలపై భక్తులు అధికారులకు పిర్యాదు చేశారు. పవిత్ర క్షేత్రంలో చోటుచేసుకున్న ఈ ఉదంతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారింది. శ్రీకాళహస్తికి చెందిన మాదవరెడ్డి ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా నెహ్రూ వీధిలోని ఆలయానికి చెందిన వరదరాజస్వామి అతిథిగృహం పర్యవేక్షకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన కుమారుడు మోహన్ రెడ్డి అనుకున్నపుడల్లా గదిని తీసుకుని సొంత కార్యకలాపాలకు ఉపయోగించుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 7వ నంబరు గదిని తీసుకుని మిత్రులతో కలిసి మద్యం, మాంసంతో విందు చేసుకున్నారు. శనివారం సాయంత్రం 3గంటల వరకు గది నుంచి వెకిలికేకలు వినబడుతుండడంతో కొందరు భక్తులు నిలదీశారు. దీంతో కొందరు యువకులు అక్కడి నుంచి జారుకున్నారు. మోహన్‌రెడ్డి మాత్రం తాగిన మైకంలో ప్రశ్నించిన వారిపై ఎదురుదాడికి దిగాడు. దీంతో భక్తులు ఆలయాధికారులకు పిర్యాదు చేశారు. ఈవో బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు ఒన్‌టౌన్ పోలీసులు అతిథిగృహం వద్దకు చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తండ్రి మాదవరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మరో ఉద్యోగి లక్ష్మీరెడ్డిని సస్పెండ్ చేశారు.



మాధవరెడ్డి

హథీరాంజీ మఠం ఏవోగా బాపిరెడ్డి



తిరుపతి, జనవరి4 (ఆంధ్రజ్యోతి) : శ్రీస్వామి హథీరాంజీ మఠం పరిపాలనాధికారిగా బాపిరెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా ఉన్న ఈయనకు ప్రభుత్వం హథీరాంజీ మఠం ఏవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది. స్థానిక మఠం పరిపాలన కార్యాలయానికి సతీ సమేతంగా చేరుకున్న దంపతులకు వేద ఆశీర్వాదంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసుల రెడ్డి ఉన్నారు.

గొప్ప చరిత్రకు నెలవు గూడూరు

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 47వ సమావేశాల్లో వక్తలు




సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ చరిత్రకారుడు కాళిదాసు పురుషోత్తం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు) /గూడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గూడూరు ప్రాంతం ఎన్నో చారిత్రక విశేషాలకు నెలవని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 47వ వార్షిక సమావేశాలు గూడూరు ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో 'గూడూరు ప్రాంతంలోని ప్రాచీన హిందూ దేవాలయాలు' అంశంపై నెల్లూరులోని ప్రాచీన భారతీయ భాషల విశిష్ట అధ్యయన కేంద్రం సీనియర్ ఫెలో డాక్టర్ సోమరాజుపల్లె మమత అధ్యక్షోపన్యాసం చేశారు.ప్రాచీన నాగజాతి, బోయలకు కేంద్రస్థానంగా గూడూరు నిలిచిందన్నారు. మౌర్యులకు, శాతవాహనులకు వాణిజ్య కేంద్రంగా ఉండేదన్నారు. గ్రీకు, రోమన్, చైనా దేశాలతో వ్యాపార, వాణిజ్య సంబంధాలను ఈ ప్రాంతం నెరిపిందన్నారు. దక్షిణాఫ్రికా, సింగపూర్, మలేషియాలకు వస్త్రాలను ఎగుమతి చేసిన చరిత్ర ఉందన్నారు. విందూరు చేపలు విదేశాలకు ఇక్కడి నుంచీ చేరాయన్నారు. నీలిమందు, పిచ్చిపొగాకు, వరిసాగులోనూ ఈ ప్రాంతం మొదటి స్థానంలో ఉందన్నారు. నిమ్మసాగులోనూ అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆధ్యాత్మిక, కళా నైపుణ్యానికి ఈ ప్రాంతంలోని దేవాలయాలు ప్రతీకలుగా ఉన్నాయన్నారు.నెల్లూరు సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కాళిదాసు పురుషోత్తం, డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ గిరి,ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. చరిత్ర నుంచే సమాజ భవిష్యత్తు రూపొందుతుందని అభిప్రాయపడ్డారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య చరిత్రలోని బహుముఖ కోణాలపై పరిశోధనలు సాగాల్సిన అవసరముందన్నారు.భావితరాలకు చరిత్రను అందించడమే సమాఖ్య ముఖ్య లక్ష్యమని హైదరాబాదుకు చెందిన ఉర్దూ యూనివర్శిటీ డీన్ ప్రొఫెసర్ వనజ అన్నారు. అనంతరం ధర్మవరం ప్రాంతానికి చెందిన సిండే మారుతీరావు బృందం ఆధ్వర్యంలో తోలు బొమ్మలాట ప్రదర్శించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమంలో రాయలసీమ, మాతంగి వ్యవస్థ చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు.ఎస్వీయూ ఆర్కియాలజీ విభాగ రిటైర్డు ప్రొఫెసర్లు కిరణ్‌క్రాంత్ చౌదరి, నాగోలు కృష్ణారెడ్డి, ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, చరిత్రకారులు కొప్పర్తి వెంకటరమణ, ఇనుగంటి చంద్రమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, స్థానిక కార్యదర్శి గోవిందు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా ప్రొఫెసర్ ఏఆర్ రామచంద్రారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు చరిత్రకారులు ఆయన్ను అభినందించారు. ఆదివారం ఏపీ హిస్టరీ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేసే అవకాశం ఉంది. చరిత్ర బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అవసరమైన కృషికి సంబంధించి పలు అంశాలను తీర్మానాలుగా రూపొందించే అవకాశం ఉంది.

13 ఎర్రచందనం దుంగల స్వాధీనం



ఎర్రచందనం దుంగలతో ఫారెస్టు అధికారులు

ఎర్రావారిపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు అధికారులు 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు చామల ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకట్రామణ తెలిపారు. వివరాలివి. నెరబైలు పంచాయతీ పులి గోని పల్లె సమీపం మామిడి తోపుల నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగు తోందని పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. శుక్రవారం రాత్రి ఆ ప్రాంతంలో ఫారెస్టు అధికారులు మాటు వేశారు. ఇదే సమయంలో వేగంగా వస్తున్న ఓ కారును ఆపారు. తప్పించుకునేందుకు ప్రయత్నించిన డ్రయివర్‌ను పట్టుకున్నారు. అతను తమిళనాడు కళకుర్చి జిల్లాకు చెందిన చంతిరాన్ అరవిత్‌గా గుర్తించారు. కారులో 191 కేజీల బరువున్న 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్‌టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



భాకరాపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లులో ఎస్‌టీయూ డైరీ, క్యాలెండర్‌ను శనివారం ఎంఈవోలు సత్యనారాయణ, గోపీనాథ్ ఆవిష్కరించారు. ఎంఆర్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం, నాయకులు వాసు, రెడ్డప్ప రెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రకాశ్, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు బహుమతుల పంపిణీ



భాకరాపేట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు 'భవిత' కేంద్రంలో శనివారం బ్రెయిలీ జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటరమణ మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని రకాల శిక్షణనిస్తూ ప్రత్యేక విద్యను అందిస్తోందన్నారు. దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాకాల: స్థానిక భవిత కేంద్రంలో బ్రెయిలీ దినోత్సవ కార్యక్రమంలో ఎంఈవోలు బాబ్జీ, లింగయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు భోజనం ప్లేటు, విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. తిరుపతిరూరల్: ఎంఆర్‌పల్లె ఎంపీపీస్కూల్‌లోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. భవితకేంద్రం టీచర్లు పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయండి



సర్పంచ్, కార్యదర్శిలకు వినతి ఇస్తున్న మహిళ

తిరుపతి రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చిగురువాడ పంచాయతీ పరిధిలోని సీఎన్‌ఆర్ గార్డెన్స్ ప్రాంతంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామ సచివాలయంలో శనివారం సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. నాలుగురోడ్ల కూడలిలో వీధిదీపాలు లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, గార్డెన్స్ గేటు ముందు భాగంలో సరైనరోడ్డు సౌకర్యం లేదని స్థానికులు విన్నవించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పంచాయతీలో ఐదు రోడ్ల నిర్మాణం, సచివాలయానికి, ఎస్‌డబ్ల్యూపీసీలకు ప్రహరీ ఏర్పాటు, కొత్తట్రాక్టర్, మినీజేసీబీలకు ప్రతిపాదనలు తయారు చేసి గ్రామసభలో తీర్మానించామని కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి పేర్కొన్నారు.

చంద్రగిరి

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి,జనవరి4(ఆంధ్రజ్యోతి):శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఆలయంలో ఉదయం స్వామివారిని ధనుర్మాస పాసాసురాలతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు.ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఆర్జితం ఇన్స్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల అభ్యున్నతికి కృషి

రామచంద్రాపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతుల్లో సామర్థ్యాలను గుర్తించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని ఎంఈవోలు మార్కొండయ్యనాయుడు, జయవేలు అన్నారు. శనివారం మిట్టూరు భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రత్యేక నైపుణ్యాలతో శిక్షణ ఇవ్వడం వలన వారి భవిష్యత్తుకు బాటలు వేయవచ్చన్నారు. ఆటల పోటీలో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. **ఎర్రావారిపాలెం:** మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ పుట్టిన రోజు ఘనంగా జరుపుకొన్నారు. ఎమ్మీఓ వెంకట సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక ప్రతిభ పిల్లలకు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ టీచర్లు పాల్గొన్నారు.

జోరుగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, నిర్మాణం పూర్తయిన రోడ్డు

తిరుపతిరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. తొలివిడతగా 24సచివాలయాల పరిధిలో 45 పనులను(సీసీరోడ్లు) చేపట్టేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.4కోట్ల మంజూరుకు ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవచూపారు. ఈనిధులతో సీసీరోడ్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే లింగేశ్వరనగర్, సాయినగర్‌లలో సీసీరోడ్ల నిర్మాణపనులను ప్రారంభించారు. వచ్చే వారంలో మరిన్ని పంచాయతీల్లో పనులు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. లింగేశ్వరనగర్‌పంచాయతీకి రూ.29లక్షలు మంజూరు చేయగా..గ్రామసచివాలయం సమీపంలోని వీధిలో రూ.4లక్షలతో(90మీటర్లు), లిటిల్‌ఏంజల్స్ స్కూల్ మార్గంలో రూ.5లక్షలతో (200మీటర్ల) సీసీరోడ్లను నిర్మిస్తున్నారు. వచ్చేవారంలో ఎంకే నాయుడుకాలనీలో రూ.20లక్షల(300మీటర్ల)తో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని సర్పంచ్ ముసుగు కోటేశ్వరరావు పేర్కొన్నారు. సర్పంచ్,సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమ్య కలసి నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ప్రారంభం

● విద్యార్థులతో కలసి భోంచేసిన ఎమ్మెల్యే నాని



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ఆనాడు ఎన్టీ రామారావు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రవేశపెట్టగా నేడు జూనియర్ కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కిందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం చంద్రగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసినా, కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు మరిన్ని పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. కళాశాలలో మూడు గదుల నిర్మాణానికి ఎంపీ ద్వారా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, టీడీపీ నాయకులు, అధ్యాపకులు, విద్యార్థినులు, పాల్గొన్నారు.

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ నాగరాణి, హెచ్‌ఎం మృదులాదేవి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కరీముల్లా, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో జడ్పీటీసీ నంగా పద్మజ రెడ్డి, మండల విద్యాశాఖాధికారులు బాబ్జీ, లింగయ్యలు పాల్గొని విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ప్రిన్సిపాళ్ల ఉమామహేశ్వరి, బేబీశ్వరరెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఆర్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న పథకం ప్రారంభ కార్యక్రమంలో ఎంఈవోలు మార్కొండయ్యనాయుడు, జయవేలు పాల్గొన్నారు. భోజన నాణ్యతను పరిశీలించారు.

ఎర్రావారిపాలెం: నెరబైలు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ మురగయ్య టీడీపీ నాయకులు కేశవులునాయుడు, దేశిరెడ్డి గోపిలు ప్రాంభించారు.

నేడు స్థానికుల దర్శన టోకెన్ల జారీ

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు కల్పించే దర్శన టోకెన్ల కోటాను ఆదివారం జారీ చేయనున్నారు. 7వ తేదీకి సంబంధించిన ఈ టోకెన్లను తిరుపతి మహతి ఆడిటోరియం, తిరుమల బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లోని కౌంటర్ల ద్వారా జారీ చేయనున్నారు. కాగా, ఈ టోకెన్లను పొందేందుకు స్థానికులు డైలామాలో పడ్డారు. ఒకవేళ ఇవి తీసుకుంటే మళ్లీ వైకుంఠద్వార దర్శన టోకెన్లు రావనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

షార్ ఎంఎస్‌ఏ డీడీగా గోపీకృష్ణ బాధ్యతలు



సూళ్లూరుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏరియా (ఎంఎస్‌ఏ) డిప్యూటీ డైరెక్టర్‌గా పి.గోపీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎంఎస్‌ఏ గ్రూపు డైరెక్టర్‌గా ఉన్న గోపీకృష్ణను పదోన్నతిపై రెండు రోజుల క్రితమే డీడీగా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు తీసుకొన్న ఈయనను సహచర ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు అభినందనలు తెలిపారు.

ఆప్కాస్ ఉద్యోగుల సంఘ క్యాలెండరు ఆవిష్కరణ

తిరుపతిరూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆప్కాస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండరును శనివారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్‌లు ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎస్.జయచంద్రలతో శనివారం వారు కలసి ఆవిష్కరించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, సంఘనాయకులు ముదిరాజ్, గంగయ్య, బాబు, సుభాష్, కిశోర్, గురుకుమార్, మురళినాయుడు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కుర్చీల వితరణ



లైబ్రరీకి కుర్చీలు అందజేస్తున్న ఐక్యం చారిటబుల్ సంస్థ ప్రతినిధులు

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక గోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రభుత్వ లైబ్రరీకి ఐక్యం చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రూ.7500 విలువచేసే 15 కుర్చీలను లైబ్రేరియన్ సూర్యనారాయణమూర్తికి అందజేశారు. పోటీ పరీక్షలు ప్రిపేరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం గ్రంథాలయ సిబ్బంది వినతిమేరకు వీటిని సమకూర్చినట్లు ట్రస్ట్ ఛైర్మన్ చింతం శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. కోశాధికారి సి.యుగంధర్, సభ్యులు రేవతి, మోహన్, నరేష్, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

నూకలగుంట సమస్య పరిష్కరిస్తా: ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల వెనుక భాగంలో దుర్గంధ సమస్య నెల రోజుల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం పథకం ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి నూకలగుంట సమస్యను తీసుకెళ్ళారు. నూకలగుంట ద్వారా దుర్వాసన వెదజల్లుతుందని, ప్రహరీ గోడ వెనుక భాగంలో పందులు సంచారంతో దోమలు, దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఎమ్మెల్యే స్పందించి నూకలగుంటను పరిశీలించారు. నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్ల ఆందోళన



వలంటీర్ల ఆందోళన శిబిరంలో మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి (ఆటోనగర్) జనవరి4 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థ కొసాగించి వేతనాన్ని రూ.10 వేలు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం నేటి వరకు అమలు చేయలేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి విమర్శించారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వలంటీర్ల శిబిరానికి వెళ్లి ఆయన సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం వలంటీర్లతో సేవలు చేసుకోకుండా పక్కన పెట్టడం తగదన్నారు. వారికి వేతనాలు ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఆందోళనలో నాయకులు రామకృష్ణ,టి.సుబ్రమణ్యం,ఎస్.జయచంద్ర, సాయిలక్ష్మీ,పి.బుజ్జి, వేణుగోపాల్, నరేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

తిరుపతికి సరస్వతి నదీతీర్థం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంజునాథ్‌శర్మ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో పవిత్ర సరస్వతి నది జన్మస్థానం నుంచి జలాలలను తిరుపతి తీసుకువచ్చినట్టు టీత్వాల్ ఎల్‌ఓసీ శారదా యాత్ర మండల్ జాతీయ కార్యదర్శి మంజునాథ్ శర్మ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన సర్వతీ జలాల కలశాలను చూపుతూ వివరాలు వెల్లడించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతం నుంచి ఈ నదీ జలాలను తీసుకువచ్చామన్నారు. ఈవిషయంలో అక్కడి ముస్లింలు సహకరించారన్నారు. శ్రీవారి పాదాల చెంత ఆ జలాలను ఉంచి పూజ చేసేందుకు తిరుపతితీసుకువచ్చామన్నారు. అనంతరం కంచి, ఉజ్జయిని, అయోధ్య తీసుకువెళ్లి పూజలు నిర్వహిస్తామన్నారు. చివరిగా ప్రయాగరాజ్‌లోని కుంభమేళాకు తీసుకువెళ్లామన్నారు. తమ ప్రయత్నానికి హైదరాబాద్ శంకర్ ప్లాంజరీ ఫౌండేషన్, బెంగుళూరు లక్ష్మీ నరసింహ ట్రస్ట్, పాక్ ఆక్రమి కాశ్మీర్ శారద కమిటీ సేవ్ కాశ్మీర్, సర్వెంట్ సొసైటీ ఆఫ్ కాశ్మీర్ పండిట్స్, టీత్వాల్ లోక్ శారదా యాత్ర మండల్ సంపూర్ణ సహాయ సహకారాలను అందించాయని వివరించారు. విలేకరుల సమావేశంలో జీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



ఏపీసదరన్ పవర్ సోలార్ వెండర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సదరన్ పవర్ సోలార్ వెండర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.మణిగండన్ కోరారు. శనివారం ఓ ప్రైవేటు హోటల్లో అసోయేసిషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగం మరింతమందికి ప్రయోజనం చేకూరేలా సౌరవిద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తమ అసోసియేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాచారం కోసం 9885475551 నంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.చంద్రశేఖర్, శ్రీనివాస్, శ్రీకాంత్, మధు, కిషోర్, సభ్యులు పాల్గొన్నారు.

కోళ్లఫారం స్థల ఆక్రమణకు యత్నం



కోళ్ళఫారం ఫీడింగ్ గదిని కూల్చేసిన ఆక్రమణదారుడు

తిరుపతి అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీకి చెందిన సర్వేనెంబరు 228లో కోళ్లఫారంలో మొండి గోడలతో ఉన్న సరుకుల గదిని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమణకు యత్నించాడు. శనివారం జేసీబీతో మొండిగోడలను కూల్చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆధారాలు చూపించాలంటూ నిలదీయడంతో సమాధానం లేదు. ఈ నేపథ్యంలో అతను వెనుతిరిగాడు. అప్పటికే వీధి వైపే గోడలను కూల్చేశాడు. గ్రామస్తులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్లారు. స్థలాన్ని రక్షించే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

తుడా టవర్స్ నిర్మాణ పనుల పూర్తికి ఆదేశం



అధికారులతో సమావేశమైన తుడా వీసీ మౌర్య

తిరుపతి, జనవరి4 (ఆంధ్రజ్యోతి): తుడా టవర్స్ నిర్మాణ పనులు గడువు లోపు పూర్తి చేయాలని తుడా వీసీ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం తుడా కార్యాలయంలో టవర్స్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల పురోగతిపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలన్నారు. ఫిబ్రవరిలోపు మోడల్ ప్లాన్, ఎగ్జిబిషన్ స్టాల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తే వేలం నిర్వహించేందుకు వీలుంటుందని అన్నారు. సమావేశంలో సెక్రటరీ వెంకట నారాయణ, ఇంజనీర్లు కృష్ణారెడ్డి, .రవీంద్ర, నిర్మాణ సంస్థ ప్రతినిధి సునీల్, తదితరులు ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు ముమ్మరం!

● షెడ్యూల్‌లో కొనసాగుతున్న మార్పు చేర్పులు

కుప్పం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఈనెల 6, 7, 8 తేదీల్లో ఖరారైన నేపథ్యంలో నియోజకవర్గంలో ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ రెండు రోజులుగా కుప్పంలోనే ఉంటూ ఆయా కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నంలతో కలసి వారు శనివారం సీఎం పర్యటనకు సంబంధించి జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. చంద్రబాబు కుప్పం పర్యటన తేదీలు ఖరారైనా, మినిట్ టు మినిట్ కార్యక్రమం మాత్రం ఇంకా ప్రభుత్వం అప్రూవ్ చేయలేదు. ఎప్పటికప్పుడు స్వల్పమైన మార్పుచేర్పులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతమున్న సమాచారం మేరకు... ముఖ్యమంత్రి చంద్రబాబు 6వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు కుప్పం చేరుకుంటారు. ద్రావిడవర్శిటీ ఆడిటోరియంలో స్వర్ణ కుప్పం విజన్ 2029, నేచురల్ ఫార్మింగ్ విజన్ కార్యక్రమాలను ప్రారంభిస్తారు.అగరం కొత్తపల్లె చేరుకుని స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. కుప్పం మండలం నడిమూరులో సోలరైజేషన్ పథకాన్ని ప్రారంభిస్తారు.ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియం చేరుకుని టీడీపీ శ్రేణులతో సమావేశమవుతారు. రాత్రికి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బస చేస్తారు. 7వ తేదీ ఉదయం టీడీపీ కార్యాలయం చేరుకుని జన నాయకుడు సెంటర్‌ను ప్రారంభిస్తారు. కార్యాలయం ఎదుట ప్రజలనుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తారు.ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మదర్ ఫ్రూట్ అండ్ వెజిటబుల్స్ కంపెనీకి సంబంధించిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు, శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు సంబంధించిన డెయిరీకి శంకుస్థాపనలు చేస్తారు. కుప్పం పురపాలక సంఘానికి రూ.92 కోట్లతో మంజూరైన నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తారు. నెట్ జీరో (కాలుష్య రహిత) నియోజకవర్గ ప్రాజెక్ట్ విషయంలో కాన్పూర్ ఐఐటీతో ఎంవోయూ కుదుర్చుకుంటారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే క్రమంలో మహిళా శక్తి భవన నిర్మాణానికి అలిప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటారు. అనంతరం శాంతిపురం కడపల్లె చేరుకుని సొంత గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తారు. తిరిగి ద్రావిడ విశ్వవిద్యాలయం చేరుకుని అకడమిక్ భవనం, కెరీర్ రీడినెస్ సెంటర్ భవనాలను ప్రారంభిస్తారు. అధికారులతో సమావేశమవుతారు. ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో రాత్రి బస చేస్తారు. 8వ తేదీ ఉదయం అమరావతి వెళ్తారు.

50వేల సభ్యత్వ లక్ష్యాన్ని పూర్తి చేద్దాం

● మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి, జనవరి4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో తమ పార్టీకి సంబంధించి 43వేల సభ్యత్వాలు నమోదయ్యాయని టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి సుగుణమ్మ తెలిపారు. ఈనెల 15లోపు 50 వేల సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేద్దామని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు అవగాహనపై శనివారం ఆమె నివాసంలో పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘ నాయకులతో సమావేశమయ్యారు. సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పనిచేసిన నాయకులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే టాప్ టెన్‌లో ఉండేలా నియోజకవర్గంలో సభత్వనమోదు చేయగల సత్తా ఇక్కడి శ్రేణుల్లో ఉందన్నారు. పార్లమెంటు సభ్యత్వ నమోదు ఇంఛార్జి శివా రెడ్డి, నాయకులు శ్రీధర్ వర్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, దంపూరి భాస్కర్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు నాయుడు, బుల్లెట్ రమణ, ఆముదాల తులసీరాం, కృష్ణ యాదవ్, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి పడకల పెంపుపై హర్షం



మాట్లాడుతున్న రత్నకుమార్, పాల్గొన్న ఇతర నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 4: తిరుపతిలోని ఈఎస్ఐ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం తీర్మానించడం హర్షణీయమని కార్మిక సంఘం ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) రెండు తెలుగు రాష్ట్రాల ఉపాధ్యక్షుడు ఎల్. రత్నకుమార్ పేర్కొన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇందుకోసం తాము 20 ఏళ్లుగా పోరాడుతున్నామన్నారు. ఇన్నాళ్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం తమ కలను నిజం చేసిందన్నారు. 1993లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఈఎస్ఐ ఆసుపత్రికి శంకుస్థాపన జరిగిందన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు 50 పడకల ఆసుత్రిగా ప్రారంభించారన్నారు. తాజాగా ఆయన ప్రభుత్వమే వంద పడకల నిర్ణయాన్ని తీసుకుందని సంతోషం వెలిబుచ్చారు. ఈ నిర్ణయం కార్మిక, ఉద్యోగులకు ఉపకరిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆర్ మురళీధర్, షఫీఉల్లా, అనూష, రంజిత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఫర్నిచర్‌ను అక్రమంగా అమ్మేశారు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి(విద్య), జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అధికారులు సుమారు రూ.60 లక్షల విలువజేసే పాత ఫర్నిచర్‌ను అక్రమంగా అమ్మేశారని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... యూనివర్శిటీ ఉన్నతాధికారులు విధి విధానాలను పాటించకుండా నచ్చినవారికి రహస్యంగా సామగ్రిని అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 20 లారీల సామగ్రి తరలిపోయిందన్నారు. ఈ సామగ్రి సుమారు రూ.60 లక్షలకు పైగా విలువజేస్తుందన్నారు. అధికారులు రికార్డుల్లో రూ. 8 లక్షలుగా పేర్కొన్నారన్నారు. ఉన్నత విద్యామండలి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు మోహన్, గుజారీ వ్యాపారు సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబక్షు, నగర నాయకులు విష్ణు, సురేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో డోర్‌డెలివరీకి ఆదరణ



కార్గోలో పరిశీలిస్తున్న ఏటీఎం రామచంద్రనాయుడు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలకు ఆదరణ లభిస్తోంది. గత నెల 20న మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాకు 6,684 పార్సిల్స్ బుక్ చేయాలని యాజమాన్యం లక్ష్యమివ్వగా గడిచిన 15రోజుల్లో 6,390పార్సిల్స్ బుక్ చేశారు. ఈవిషయంలో జిల్లా రాష్ట్రంలో ఏడవ స్థానం లభించింది. మిగిలిన 15రోజుల్లో అదనంగా వందశాతం పార్సిల్స్ నమోదు చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఈనెల 19వరకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేరుకున్న చెత్త తొలగింపు



తిరుపతి అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని తిరుమలనగర్ పంచాయతీ పరిధిలో మంగళం ఆర్టీసీ డిపో రోడ్డులో చెత్త నిల్వలను తొలగించారు. ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్ శనివారం ఆంధ్రజ్యోతిలో 'రోడ్డు కంపు కంపు' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన గ్రామ సచివాలయ కార్యదర్శి స్వాతిశ్రీ ఉదయం పారిశుధ్య కార్మికులతో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

మాస్టర్ రోడ్డు పనులకు
మళ్లీ బ్రేక్

● పరిహారం అంశంపై స్థల యజమానుల అభ్యంతరం



రోడ్డును పరిశీలిస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ, స్థల యజమానులు

తిరుపతి (జీవకోన), జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం పార్కు ఎదురుగా సత్యనారాయణపురానికి వెళ్లే మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు అన్నీ అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఈ రోడ్డును నగర పాలకసంసవిరజా మార్గం పేరుతో సత్యనారాయణపురం సర్కిల్ నుంచి తిరుమల బైపాస్ రోడ్డు వరకు రూ.1.64కోట్లతో పనులతో నిర్మించింది. గత ఏడాది మార్చి 15న ప్రారంభించింది. అయితే వంద మీటర్ల రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో ఉంచిం. ది స్థల యజమానులు కోర్టును ఆశ్రయించడంతో ఈ పనులు ఆగిపోయాయి. ఈ రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఇటీవల కొంత మేర గుంతలను మట్టితో పూడ్చినా వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. ప్రజల ఫిర్యాదులతో నగరపాలక సంస్థ అధికారులు ఎట్టకేలకు మిగిలిన స్థలంలోనే రోడ్డు వేయడానికి సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో శనివారం పనులు ప్రారంభించేందుకు వచ్చారు. ఇదే సమయంలో స్థల యజమానులు చేరుకుని పనులను అడ్డుకున్నారు. సమాచారం తెలిపి అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ సిబ్బందితో వచ్చారు. పరిహారం చెల్లిపు అంశంపై తాముకోర్టును ఆశ్రయించామని స్థల యజమానులు అన్నా రామచంద్రయ్యయాదవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు గత్యంతరం లేక వెళ్లిపోయారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ చెప్పారు. వారి సూచనల మేరకు సమస్యను పరిష్కరిస్తామన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు కౌన్సిల్ అప్రూవల్ ఉందన్నారు.

వైసీపీ నేత కోసం రోడ్డు నిర్మాణమా..?

● గ్రామ సభలో నిలదీసిన స్థానికులు



రిక్షాకాలనీలో అధ్వాన రహదారి



హరితాకాలనీలో ఇళ్లే లేని చోట బీటీ రోడ్డు

తిరుపతి అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అక్కడ ఇల్లు కూడా కనబడదు. అయినా నాణ్యతతో కూడిన బీటీ రోడ్డు ఉంది. అంతకంటే ముందుగానే ఏర్పాటైన వీధుల్లో మాత్రం రోడ్లు గుంతలమయ్యాయి. గత వైసీపీ హయాంలో పంచాయతీ పాలకుల నిర్వాకమిది. తిరుమలనగర్ పంచాయతీలో పరిధిలో తుడాక్వార్టర్స్‌లోని ఎల్ఐజీ మెయిన్‌రోడ్డు, ఎంఐజీ, హెచ్ఐజీలో రిక్షాకాలనీ, కొళ్లపారం, జయశంకర్‌కాలనీ, గంగాదేవికాలనీ, శేషాచలనగర్, తిరుమలనగర్ మెయిన్‌రోడ్లు ధ్వంసమైపోయాయి. గత వైసీపీ పాలనలో మరమ్మతులు చేపట్టలేదు. వైసీపీ నాయకులు, కార్యకర్తలున్న వీధుల రోడ్లు మాత్రం మరమ్మతులు చేసుకున్నారనే విమర్శలున్నాయి. హరితాకాలనీలో ఓ ప్రధాన నాయకుడికి ప్లాట్స్ ఉండడంతో గతేడాది ఎన్నికల ముందు 600మీటర్లు ఎల్ ఆకారంలో తారు రోడ్డు వేశారు. ఇందుకు రూ.20లక్షలు ఖర్చుపెట్టారు. గురువారం జరిగిన గ్రామ సభలో పలువురు ఈ విషయాన్ని ప్రస్తావించి విమర్శలు గుప్పించారు. దీనిపై సచివాలయ కార్యదర్శి స్వాతిశ్రీ స్పందించారు. తొలివిడతగా మిగతా కాలనీల్లో డ్రైన్స్, వీధిలైట్లు, పారిశుధ్యం, తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. తరువాత రోడ్లు నిర్మిస్తామన్నారు. ఇళ్లు లేని చోట రోడ్డు వేశారన్న ఫిర్యాదును పరిశీలిస్తామన్నారు.

వివేక్‌పై వ్యక్తిగత విమర్శలు సహించం

● మాల మహాసభ నాయకుల హెచ్చరిక

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎంపీ గడ్డం వివేక్‌పై వ్యక్తిగత దూషణలకు దిగితే సహించేది లేదని జిల్లా మాల మహాసభ సీనియర్ నాయకులు మల్లారపు మధు, పూతలపట్టు ప్రభాకర్ మందకృష్ణ మాదిగను హెచ్చరించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ... మాల మాదిగలను సమానంగా గౌరవించి సహాయ సహకారాలు అందించిన కుటుంబం మాజీ ఎంపీ వెంకటస్వామిదన్నారు. కారంచేడు, చుండూరు ఘటనల్లోనూ వెంకటస్వామి కుటుంబం స్పందించిన తీరు మర్చిపోరాదన్నారు. అటువంటి కుటుంబానికి చెందిన గడ్డం వివేక్‌ను మంద కృష్ణ మాదిగ విమర్శించడం సముచితం కాదన్నారు.. విలేకరుల సమావేశంలో మాల మహాసభ నాయకులు రాజా నాయక్, చంద్ర, వినోద్ కుమార్, రాజశేఖర్, నరేంద్ర, సోమునాయక్, ప్రసన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE V ADDITIONAL DISTRICT JUDGE, TIRUPATI
E.P.No. 95 /2023
Arb. No. 216 / 2022

Between:
M/s. Shriram Transport Finance Co., Ltd., Tirupati rep., by its S.P.A. Holder U.Sreenivasulu ...**Decree Holder**
And:
K.Thyagarajulu Reddy and others ... **Judgment Debtor**

PUBLIC AUCTION SALE NOTICE

That the above E.P. is filed by the D.Hr for attachment and sale of the below schedule mentioned immovable property towards realization of the amount payable by the above named J.Drs to their D.Hr company and the Hon'ble court directed for sale of schedule property in Public Auction on 20-01-2025 So, the interested bidders / purchasers may participate in the sale to be conducted by the Hon'ble court on the above said date.

SCHEDULE : Chittoor Revenue District Tirupati Sri Balaji Registration District, Chandragiri Sub-District - Chandragiri Mandal, Netha Kuppam Village accounts, Sy.No. 137/3F, in an Extent ofAc.0.79 cents Addl.Desc: Well Etc 1/3 Share bounded by: **East :** Land of P.Mohana Reddy, **West :** CL Land, **North :** Land of K.Kamalamma, **South :** CL Land, Court Auction Dt. 20-01-2025, **Time :** 10:30 A.M. onwards, **Place:** Hon'ble V addl. District Judge's court, Tirupati

(By Order of the Court)
PATTEM JANARDHANA,B.A.,B.L.
Advocate for Petitioner/D. Hr

వసతుల కల్పనకు వీధి వ్యాపారుల ధర్నా



నగర పాలక కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తిరుపతి(ఆటోనగర్)జనవరి4(ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి వ్యాపారులకు వసతులు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కె.రాధాకృష్ణ,చంద్రశేఖర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. నగర పాలక కార్యాలయం ఎదుట శనివారం వీధి వ్యాపారుల సంఘం అధ్వర్యంలో ధర్నా జరిగింది. ధర్నాలో వారు మాట్లాడుతూ వీధి వ్యాపారులకు చట్టం కల్పించిన హక్కుమేరకు నగరంలో వసతులు కల్పించాలని కోరారు. వారికి సంబంధించిన చట్టాలను నగర పాలక అధికారులు అమలు చేయడంలేదని మండిపడ్డారు. చట్టం మేరకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నాయకులు విజయకుమార్,గురవయ్య, భాష, సంజీవయ్యమణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

79 మంది పాలిటెక్నిక్ విద్యార్థుల ఎంపిక

తిరుపతి(విద్య), జనవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శనివారం జరిగిన క్యాంపస్ ఎంపికల్లో 79మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. నాయుడుపేటకు చెందిన గ్రీన్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంపిక నిర్వహించగా 126 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో మెకానికల్ బ్రాంచి నుంచి 36 మంది, సివిల్-22, ఎలక్ట్రికల్ - 21 మంది మొత్తం 79 మంది ఉద్యోగాలు సాధించినట్టు చెప్పారు.

తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, తిరుపతి
ప్రధాన కార్యాలయము

హెచ్చరిక ప్రకటన

ఈ క్రింది వ్యక్తులు పై బ్యాంకు నందు సేఫ్ డిపాజిట్ లాకర్లను అద్దెకు తీసుకొని లాకర్ అగ్రిమెంట్ మేరకు సుదీర్ఘకాలముగా నిర్వహించక మరియు రెన్యువల్ చేయక లాకరు అద్దె బకాయిపడి వున్నారు. బ్యాంకు రికార్డులందు నమోదు కాబడియున్న చిరునామాలకు పలుమార్లు నోటీసులు పంపబడినను సమాధానము లేదు. కనుక ఇదే ఆఖరు నోటీసుగా భావించి **తేది : 04-02-2025**గాని, ఆలోగా గాని సంబంధిత లాకరుదారులు / వారసులు పూర్తి బకాయి చెల్లించి నిబంధనల ప్రకారము లాకర్లను క్రమబద్ధీకరణ చేసుకొనవలెను. లేనిచో ఇందుపై ఎటువంటి తదుపరి సమాచారము / నోటీసు లేకుండా సదరు లాకర్లను సంబంధిత అధికారుల సమక్షమున బలవంతంగా తెరువబడి (బ్రేక్ ఓపెన్) బ్యాంకు వారు స్వాధీనము చేసుకొనబడును. సదరు లాకర్ల అద్దె, బకాయిలు, లాకర్లు తెరువబడుటకు అయ్యే ఖర్చులు, ఇతర ఛార్జీలను సంబంధిత లాకరుదారులు / వారి వారసుల నుండి చట్టపరముగా చర్యల ద్వారా వసూలు చేయబడును.

వ. నెం.	లాకరు నెం.	లాకర్ హోల్డర్ పేరు	చిరునామా	బకాయి మొత్తం	బకాయి తేది
1.	6	కంచి గీర్వాణి పాండురంగం	C/o గీర్వాణి, డో.నెం.57, టిటిడి స్టాఫ్ క్వార్టర్స్, గోవిందరాజ నగర్, తిరుపతి	7800+GST	18-07-2012
2.	65	సి.ఎస్.గోపినాథ రెడ్డి	512, సుందరనారాయణ నిలయం రెడ్డి & రెడ్డి కాలని, తిరుపతి-517501	7800+GST	19-07-2012
3.	115	1.పి.క్రిష్ణారెడ్డి 2.పి.సుగుణాకర్‌రెడ్డి	1. తండ్రి పి.గోవిందరెడ్డి, డో.నెం.42, నెహ్రూ వీధి, తిరుపతి-517501 2.తండ్రి పి.గోవిందరెడ్డి	9600+GST	04-06-2009
4.	121	పి.గీతాంజలి	భర్త పి.ఆనందరెడ్డి, డో.నెం.18-4-81 వివేకనంద నగర్, రైల్వే కాలని, తిరుపతి - 517501	7800+GST	15-05-2012
5.	180	1. ఎస్.భువనేశ్వరమ్మ 2. ఎస్.హెచ్. బాబు	తండ్రి వెంకటరమణ,డో.నెం.13-7-907 కొర్లగుంట, తిరుపతి - 517501	7200+GST	07-05-2013
6.	267	1.ఎం.మాణిక్యం రెడ్డి 2.ఎం.బాలసుబ్రమణ్యం	తండ్రి ఎం.మునస్వామి రెడ్డి, తండ్రి ఎం.మాణిక్యం రెడ్డి, డో.నెం.148, జి.ఎస్.మాడస్ట్రీట్,తిరుపతి. 2) డో.నెం.212,తిలక్ రోడ్డు,తిరుపతి	8400+GST	04-01-2011
7.	296	పి.వి.చలం	తండ్రి పి.శ్రీనివాసులు, డో.నెం.189, హెచ్2, కోటకొమ్మలవీధి, తిరుపతి	7800+GST	03-02-2012
8.	398	జె.వెంకటరమణ	1) తండ్రి జె.లక్ష్మయ్య శెట్టి, కాపు వీధి, ఏర్పేడు2) తండ్రి జె.లక్ష్మయ్య శెట్టి, డో.నెం. 137, డి.టైప్ క్వార్టర్స్,తిరుపతి	9000+GST	25-05-2010
9.	466	1.వి.బాబు 2.వి.వనజ	1) తండ్రి వి.శంకరయ్య, 2)భర్త వి.బాబు రావు, డో.నెం. 345 నేతాజి రోడ్డు, తిరుపతి	13200+GST	09-01-2003
10.	494	బి.తులసి రామిరెడ్డి	తండ్రి బి.నారాయణ రెడ్డి, డో.నెం.3/30, చెంబేటి వీధి, తిరుపతి	8400+GST	10-03-2011
11.	517	ఎస్.ఈశ్వర చంద్ర విద్యాసాగర్	తండ్రి ఎస్.మునస్వామి నాయుడు, రాజుల కండ్రిగ (గ్రా&పో) కె.వి.బి.పురం మం., చిత్తూరు జిల్లా	9600+GST	14-05-2009
12.	538	1.పి.మోదయ్య 2.పి.లక్ష్మి ప్రసన్న	డో.నెం.6-6-514,ఇర్లా వీధి, తిరుపతి	17000+GST	31-10-2008
13.	625	1.సి.మాధురి 2. సి.చంద్రశేఖర్ నాయుడు	1.భర్త సి.చంద్రశేఖర్ నాయుడు 2. సి.రంగయ్య నాయుడు డో.నెం.195,మర్రిమాను వీధి,తిరుపతి	9600+GST	23-07-2009
14.	654	జె.మునిసుబ్రమణ్యం	తండ్రి జె.మునిక్రిష్ణ, డో.నెం.110/ఎ గోపాల్‌రాజు కాలనీ,ఆర్.సి.రోడ్డు,తిరుపతి	8400+GST	04-01-2011
15.	687	వి.శశిరేఖ	భర్త వి.శ్రీనాథ్ రెడ్డి, డో.నెం.19-13-1-1/6, నారాయణ పురం, టి.ఎస్.ఆర్.రోడ్డు, తిరుపతి	7200+GST	12-05-2013
16.	723	ఆర్.కుప్పస్వామి	తండ్రి ఆర్.మునస్వామి, డో.నెం.3-6-175, కటికరంగడి వీధి, తిరుపతి	10200+GST	23-03-2008
17.	845	పి.రామజోగేంద్రబాబు	తండ్రి పి.చిన్నబ్బనాయుడు, డో.నెం.18-1-46/జె10 ప్రశాంతి నగర్, కె.టి.రోడ్డు, తిరుపతి	7200+GST	10-03-2012

తిరుపతి
తేది : 04-01-2025
సం/- మేనేజింగ్ డైరెక్టర్
తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, తిరుపతి

7, 8 తేదీల్లో
పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం



మెగా ఇంపాక్ట్ తిరుపతి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), జనవరి 4(ఆంధ్రజ్యోతి): డాలర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 7,8 తేదీల్లో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం(మెగా ఇంపాక్ట్ తిరుపతి) నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధినేత డాలర్స్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహతి ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం జరుగనుందన్నారు. యువతలో నిబిడీకృతమైన సృజనాత్మకను వెలికి తీసేందుకు మేధావులు, విజ్ఞానపరులు, పలు అంశాల్లో నిష్ణాతులైన ప్రముఖులు దిశానిర్దేశం చేస్తారన్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ప్రముఖ జర్నలిస్టు బాలలత, జగన్ గురూజీ, సినీ నటులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు కేవీ ప్రదీప్ లాంటి ప్రముఖులు హాజరుకానున్నారని వివరించారు. ఇది పూర్తి ఉచితమన్నారు. నడ్డి నారాయణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

పెన్షనర్ల డీఏలు, అరియర్స్ ఇవ్వండి



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న లక్ష్మీకర్‌రెడ్డి, టి.గోపాల్

తిరుపతి (ఆటోనగర్) జనవరి4 (ఆంధ్రజ్యోతి): పెన్షనర డీఏ, అరియర్స్‌ను చెల్లించాలని ఆర్‌పిజీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టి.గోపాల్ కోరారు. ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీకర్ రెడ్డి చేతుల మీదుగా శనివారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి అవలంబించడంతో విశ్రాంత ఉద్యోగులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. హరికృష్ణబాబు, వెంకటాచలపతి, పాపయ్యనాయుడు, వెంకటనారమణపాల్గొన్నారు.

రైతు పురుషోత్తంనాయుడికి అభ్యుదయ పురస్కారం


మంత్రి, ఎంపీ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న రైతు పురుషోత్తం నాయుడు

రేణిగుంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : రాస్ కేవీకే దత్తత రైతు పురుషోత్తం నాయుడుకు అభ్యుదయ పురస్కారం లభించింది. రామచంద్రాపురం మండలం మిట్టూరు గ్రామానికి చెందిన పురుషోత్తంనాయుడు వ్యవసాయంలో రాస్ కృషి కేంద్రం సూచనలతో ఆధునిక సాంకేతిక సమగ్ర వ్యవసాయ విధానం పాటిస్తూ పలువురు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించిన గుంటూరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం గుంటూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయనకు అభ్యుదయ రైతు పురస్కారం అందజేశాయి. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయులు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎఎస్.వెంకటరత్నం, కేవీకే హెడ్ డాక్టర్ శ్రీనివాసులు తదితరులు రైతు పురుషోత్తం నాయుడును అభినందించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ దర్శకుడు ఆదిత్య, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తెలంగాణ ఎమ్మెల్యే నవీన్‌కుమార్ ఉన్నారు.


ఆదిత్య



ఆర్పీ ఠాకూర్- మురళీమోహన్


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం : రూ.3.34 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 56,550

తలనీలాలు సమర్పించినవారు : 28,853



మహాక్షేత్రం : తిరుపతి గోవిందరాజస్వామి ఆలయం

అలసిన స్వామి!


ఆలయ గోపురం

ఏడు కొండలస్వామికి స్వయానా అన్న గోవిందరాజులు. కొండ మీద తమ్ముడికి భక్తులు నిలువు దోపిడీలు ఇచ్చి గోవిందలు పెడుతూ ఉంటే, కొండకింద ఉండే గోవిందరాజులు మాత్రం ఏడుకొండలస్వామికి వచ్చిన సొమ్మును లెక్కించి లెక్కించి అలసిపోయి, కుడిచేతిని తలకింద పెట్టుకుని పడుకుని ఉంటాడు.




గోవిందరాజస్వామి ఆలయం

తిరుపతి(కల్చరల్)

తిరుపతి పట్టణంగా ఉన్నపుడు.. ఎక్కడ నుంచి చూసినా ఆకాశంలోకి గర్వంగా తలెత్తి నిలబడి నేనున్నానన్నట్టుగా కనబడేది గోవిందరాజస్వామి గుడి గోపురం.

తిరుపతి నగరంగా మారినాక.. ఆకాశాన్ని తాకే బహుళ అంతస్తుల భవనాల నడుమ తొంగి చూస్తున్నట్టుగా కనిపించి మాయమవుతోంది ఈ మహాగోపురం.

దక్షిణ భారతదేశంలోనే పురాతన చారిత్రక ఆనవాలు గోవిందరాజస్వామి గుడి. తొలినుంచీ ఎందుకోగానీ తిరుమలలా, తిరుచానూరులా భక్తుల రద్దీ ఇక్కడ కనిపించదు. విశాలమైన ఆలయమూ, ఆదాయమూ ఉన్నప్పటికీ 15వ శతాబ్దం వరకూ ఈ ఆలయానికి పెద్దగా ప్రాశస్త్యం లేదు. శ్రీకృష్ణదేవరాయలు ఏడుమార్లు తిరుమలకు వచ్చినా, ఈ దారిలోనే శ్రీకాళహస్తికి వెళ్లినా గోవిందరాజులును ఎందువలననో దర్శించుకోలేదు. ఒక్క సాళువ నరసింగరాయలు మాత్రమే 1494 వరకూ ఈ ఆలయంపై శ్రద్ధ చూపించినట్లు తెలుస్తోంది. ఇదే ఆనవాయితీని ఇప్పటి పాలకులు కూడా కొనసాగిస్తున్నారు. తిరుమల కొండకు వచ్చే ప్రముఖులు, తిరుచానూరు అమ్మవారిని కూడా దర్శించుకుంటారు గానీ నగరం నడిబొడ్డున ఉండే గోవిందరాజస్వామిని మాత్రం దర్శించుకోవడానికి ఆసక్తి చూపించరు. అయినా సాధారణ భక్తులు మాత్రం, రైల్వే స్టేషనుకు ఎదురుగానే ఉండే ఈ ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుని వెళ్తుంటారు.



రాజగోపురం

ఇక గోవిందరాజస్వామిగుడి రాజగోపురాన్ని మట్ల కుమార అనంతరాయ అనే దేవచోళ కుటుంబానికి చెందిన రాజు క్రీ.శ. 1628లో నిర్మించారు. ఏడు అంతస్తులు, 50 మీటర్ల ఎత్తు ఉన్న గోపురం ఇది. గోపురం మీద రామాయణ ఘట్టాలను తెలిపే వందలాది శిల్పాలు ఉంటాయి.

గుడి నిర్మాణ చరిత్ర

క్రీ.శ.1130 తర్వాత ఈ ఆలయ నిర్మాణం 89 సంవత్సరాల పాటు పలు దశలుగా సాగింది. క్రీ.శ. 1219లో లోపలి గోపురం నిర్మాణం జరిగింది. అంచలంచెలుగా గుడి విస్తరణ జరిగింది. 1220న రామానుజ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. దాని తరువాత 230 సంవత్సరాలకు 1457లో మరికొన్ని నిర్మాణాలు జరిగాయి. 1330వ సంవత్సరం నుంచి ఈ ఆలయానికి సంబంధించిన అనేక దానశాసనాలు లభిస్తున్నాయి. ఇద్దరు ద్వార పాలకులను నంద్యాల నారప్పరాయ అనే వ్యక్తి 1549 మార్చి 18న ఏర్పాటు చేసినట్లు శాసనం ఉంది. అలాగే క్రీ.శ. 1219లోనే గోవిందరాజ ఆయంలో అఖండదీపం వెలిగించేందుకు వీరనరసింహరాయల రాణి 32 గోవులను సమర్పించింది. విజయనగర ఆలయ నిర్మాణ శైలిలో ఉండే ఈ ఆలయంలోని వసంత మండపాన్ని అహోబిల మఠానికి చెందిన వన శఠగోప జీయర్ క్రీ.శ.1494లో నిర్మాణం చేశాడు. అయితే ఇది పూర్తి కాలేదు. దీనిని ఆ తరువాత రెండువేల పణాల సొమ్ముతో నల్లార్ అంగాండి అనే వ్యక్తి పూర్తి చేసినట్లు ఆధారాలున్నాయి. నీరాళి మండపాన్ని పోటు సమీపంలో అప్పాపిళ్లై అనే వ్యక్తి క్రీ.శ.1506లో నిర్మించాడు. క్రీ.శ.1497 ప్రాంతంలో చిత్రకూట మండపం, క్రీ.శ.1542 ప్రాంతంలో లక్ష్మీ మండపం వాడుకలోకి వచ్చినట్లు ఇందుకు సంబంధించిన దాన శాసనాల ద్వారా తెలుస్తోంది. వేదాంగదేశికుల సన్నిధికి సమీపంలోని నాలుగుకాళ్ల మండపం 1494లో నరస రాజ ఉడైవరులు కట్టించారు.

ఉపాలయాలు : ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుడు, గోదాదేవి (ఆండాళ్) ఆలయం, చక్రత్తాళ్వార్ (సుదర్శన చక్రం), విష్వక్సేనుడు, నమ్మాళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్, తిరుమంగైయాళ్వార్, మధురకవి ఆళ్వార్, తిరుమలనంబి, రామానుజులు, కురుత్తాళ్వార్, సాలై నాచ్చియారు (పుండరీక వల్లీతాయారు) వంటి ఆలయాలున్నాయి.

ఆలయ వేళలు: రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 దాకా.

పూజలు, కైంకర్యాలు: తిరుమల తరహాలోనే సుప్రభాతం, తోమాల, అభిషేకం, ఏకాంత సేవలు జరుగుతాయి. టికెట్ ధరలు రూ.5 నుంచి రూ.20 దాకా మాత్రమే ఉంటాయి.

క్రీ.శ. 9,10 శతాబ్దాలనాటి కథ..

దక్షిణాదిలో శైవం పుంజుకుంది. విష్ణు ఆరాధనకు అడ్డంకులు ఏర్పడినాయి. అప్పటి చోళరాజు 1వ కుళోత్తుంగచోళుడు చిదంబరంలోని గోవిందరాజుల విగ్రహాన్ని ఆలయం నుంచి పెకిలించివేశాడు. హోయసల రాజ్యం (మైసూరు)లో ప్రవాసం ఉన్న రామానుజులు సూచనతో విగ్రహం తిరుపతికి చేరింది. అప్పటికే కపిల తీర్థానికి దక్షిణంగా ఉన్న కొత్తూరులో శ్రీపార్థసారధి ఆలయం ఉండేది. ఈ ఆలయ ప్రాకారంలోనే గోవిందరాజులకు ఒక గర్భ గుడి నిర్మించారు. 1130 ఫిబ్రవరి 24న గోవిందరాజస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగిందంటారు. అందువలన ఈ గుడి ప్రాంతాన్ని గోవిందరాజపురం అని పిలిచేవారు. తర్వాత దీనినే రామానుజపురం అని పిలిచేవారు. తిరుపతి అనే పేరు ఎప్పటి నుంచి వాడుకలోకి వచ్చిందో చెప్పే ఖచ్చితమైన ఆధారాలు లేవు.

ముఖ్యమైన ఉత్సవాలు

వార్షిక బ్రహ్మోత్సవాలు: మే-జూన్‌లో ఎనిమిది రోజులు జరుగుతాయి. నాలుగవ రోజు గరుడసేవ జరుగుతుంది.

తెప్పోత్సవాలు: ఫిబ్రవరి మూడవ వారంలో ఆరు రోజులు జరుగుతాయి.

ఇంకా.. జనవరి రెండవ వారంలో పదమూడు రోజులు అధ్యయనోత్సవాలు, ఇదే నెలలో గోదా పరిణయం, మార్చిలో సాలై నాచియార్ పంగుణి ఉత్సవం, జూలైలో జ్యేష్టాభిషేకం మూడు రోజులు, సెప్టెంబరులో పవిత్రోత్సవం మూడు రోజులు, ప్రతి నెలా పున్నమి గరుడసేవ జరుగుతాయి.


ఆలయ పుష్కరిణి

జోరుగా వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు




స్వర్ణరథాన్ని ట్రయల్ రన్ చూస్తున్న అధికారులు - మహాద్వార గేట్లను శుభ్రపరుస్తున్న సిబ్బంది - సెట్టింగుల కోసం తీసుకువచ్చిన సామగ్రి

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. జనవరి 10న ఏకాదశి, 11న ద్వాదశిని పురస్కరించుకుని 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠద్వార దర్శనాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ గోపురం అలంకరణలకు లైట్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే మహద్వారం గేట్లను ప్రత్యేక రసాయనాలతో శుభ్రపరుస్తున్నారు. ఇక, ఈ ఏడాది ప్రత్యేకంగా మైసూరు దసరా ఉత్సవాల్లో విద్యుత్, పుష్పాలంకరణలు చేసే ప్రత్యేక నిపుణులను తిరుమలకు రప్పించారు. వారు ప్రస్తుతం ఆలయం ముందు ప్రత్యేకంగా ఓ షెడ్‌ను ఏర్పాటు చేసి, సెట్టింగ్ నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏకాదశి సందర్భంగా నిర్వహించే స్వర్ణరథాన్ని కూడా అధికారులు సిద్ధం చేస్తున్నారు. శనివారం స్వర్ణరథాన్ని కొంతదూరం ముందుకు కదలించి పనితీరును పరిశీలించారు. ఇక భక్తులకు ఇబ్బంది లేకుండా నారాయణగిరి వద్ద పటిష్ఠమైన క్యూలు ఏర్పాటు చేస్తున్నారు.


విద్యుత్ అలంకరణల కోసం సిద్ధం చేస్తున్న లైట్లు

\- తిరుమల, ఆంధ్రజ్యోతి


ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

ఏర్పాట్లను పరిశీలించిన ఛైర్మన్, ఈవో

వైకుంఠద్వార దర్శనం కోసం తిరుమలలో జరుగుతున్న ఏర్పాట్లను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. ముందుగా బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌కు చేరుకుని అక్కడ స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీచేసే కేంద్రాలను చూశారు. తర్వాత ఔటర్ రింగ్ రోడ్డు, కృష్ణతేజ రెస్ట్ హౌస్ వద్దనున్న క్యూలు, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అన్నమయ్య భవనంలో ఏర్పాట్లపై టీటీడీ, జిల్లా, పోలీసు అధికారులతో సమీక్షించారు. అనంతరం ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ టికెట్లు, టోకెన్లు ఉన్న వారికే వైకుంఠద్వార దర్శనాలు ఉంటాయని మరోసారి స్పష్టం చేశారు. వీఐపీలు వచ్చే క్రమంలో ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 7 లక్షల మంది భక్తులు వైకుంఠద్వార దర్శనం చేసుకుంటారనే అంచనా వేస్తున్నామని తెలిపారు. కాగా, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తిరుపతిలోని పలు కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.

అడవిలో దారితప్పిన విద్యార్థుల ఆచూకీ లభ్యం

- జలపాతంలో విద్యార్థి మృతి
- అడవిలో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది గాలింపు
- అర్ధరాత్రి విద్యార్థులను కనుగొన్న పోలీసులు



రైల్వే కోడూరుకు చేరుకున్న విద్యార్థులు

రైల్వేకోడూరు/శ్రీకాళహస్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవిలో దారి తప్పిన విద్యార్థులను శుక్రవారం అర్ధరాత్రి 12.40 గంటలకు కనుగొన్నారు. గుంజన జలపాతం సమీపంలోని సుడిగుండంలో పడిన ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని పానగల్ ప్రాంతానికి చెందిన పెద్దేశుగారి సాయిదత్ (ఓపెన్ డిగ్రీ విద్యార్థి) (26), పట్నం గిరి (బీటెక్ విద్యార్థి), తమ్మన్నగారి కేదార్‌నాథ్ (బీటెక్ విద్యార్థి), వి.దినేశ్ (చెన్నైలో ఉద్యోగి), పి.దినేష్ (బీటెక్), ఇ.మోహన్‌క్రిష్ణ (డిగ్రీ విద్యార్థి)లు తమ స్వగ్రామమైన పానగల్ నుంచి రైల్వేకోడూరు మండలంలోని మాధవరంపోడుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం శేషాచలం అడవిలో ఉన్న గుంజన జలపాతం వద్దకు రెండు మోటారు బైకుల్లో బయలుదేరారు. మాధవరం పోడుకు సమీపంలో ఉన్న వాగేటికోన మినీ రిజర్వాయర్ వద్ద మోటారు బైకులను పార్క్ చేసి అక్కడి నుంచి కాలినడకన గుంజన జలపాతం వెళుతుండగా నీటి ఒరవడి ఎక్కువగా ఉండడం, చీకటి పడడంతో జలపాతం వద్దకు వెళ్లలేకపోయారు. ఒక చిన్నపాటి కొండపై కూర్చున్నారు. ఇందులో సాయిదత్, మోహన్‌కృష్ణ, వి.దినేష్ జారి నీటి సుడిగుండంలో పడిపోయారు. కేదార్‌నాథ్, పి.దినేష్, గిరి నీటిలోకి దిగి మోహన్‌కృష్ణ, వి.దినేష్‌లను కాపాడారు. సాయిదత్ జాడ కనిపించలేదు. దినేష్ అక్కడి నుంచి పది కిలోమీటర్లు నడుచుకుని సెల్‌ఫోన్ సిగ్నల్స్ వచ్చే ప్రాంతానికి వచ్చి బంధువులు, 108కు సమాచారం అందించి లోకేషన్ పంపాడు. కొన్ని గంటల తర్వాత శవం నీటిపై తేలియాడింది. శవాన్ని బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సిబ్బంది కలసి అడవిలో గాలింపు చర్యలు చేపట్టి అర్ధరాత్రి 12.40 గంటలకు వారు ఉన్న చోటును కనిపెట్టారు. తెల్లవారుజామున 4.30 గంటలకు వారంతా రైల్వే కోడూరుకు చేరుకున్నారు. విద్యార్థులను రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. సాయిదత్ శవాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష కోసం తరలించినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు. సాయిదత్ మృతితో పానగల్‌లో విషాదచాయలు అలముకున్నాయి. శ్రీకాళహస్తి శ్రీరామ్‌నగర్‌కాలనీకి చెందిన దత్తసాయి ఆధ్యాత్మిక వేదికల్లో డ్రమ్స్ వాయిద్యం చేస్తుండేవాడు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజూ రాత్రి ఏకాంతసేవ సమయంలో స్నేహితులతో కలిసి డ్రమ్స్ వాయిద్యాన్ని ఉచితంగా చేసేవారు.


మృతిచెందిన సాయిదత్

పాఠశాలలో 24 మంది విద్యార్థినులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు - పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 24 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు.శనివారం మధ్యాహ్నం భోజనం చేశాక వాంతులు, విరేచనాలు కావడంతో వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పాఠశాలలో 654 మంది చదువుతున్నారు. ఒకే ప్రహరీ ఆవరణలో జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ఉన్నాయి. తొలుత జూనియర్ కళాశాల విద్యార్థినులకు డొక్కా సీతమ్మ భోజనం పథకం కింద వంట చేశారు. ఆ వంట కార్మికులే తరువాత హైస్కూలులో భోజనం తయారు చేశారు. అయితే ఈ భోజనం సరిగ్గా ఉడకలేదని సమాచారం. పాఠశాల సమయం ముగుస్తుండటంతో హడావుడిగా ఈ అన్నం పెట్టారని విద్యార్థినులు చెబుతున్నారు. దీంతో స్వల్ప అస్వస్థతకు గురైన 24 మంది విద్యార్థులను చంద్రగిరి ఆసుపత్రికి తరలించి, వైద్య సేవలు అందించారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసరావు, చంద్రగిరి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణలతో కలిసి బాధిత విద్యార్థినులను ఎమ్మెల్యే పులివర్తి నాని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. కాగా వంట కార్మికులపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్లతో తొలగించలేదు. వీరి నిర్లక్ష్యం వల్ల చాలాసార్లు భోజనం చేయడంలేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌కు మంత్రి సవిత ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సవిత కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెంటనే కలెక్టర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. అస్వస్థతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి, సదస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పర్యాటక, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధికి సూచనలు ఇవ్వండి

- మైస్ టూరిజం కాన్ఫరెన్సులో కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక, ఆధ్యాత్మిక రంగాలకు మంచి ప్రాధాన్యత ఉందని, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. ఐఐటీ కళాశాల క్యాంపస్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ జిల్లా పర్యాటక కౌన్సిల్ తిరుపతి ఆధ్వర్యంలో జిల్లాలో మైస్ పర్యాటక రంగంపై ఒకరోజు సదస్సు నిర్వహించారు. పలు యూనివర్సిటీల వీసీలు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ రంగ ప్రతినిధులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మైస్ టూరిజం అభివృద్ధికి గల అవకాశాలు,అనుసంధానం తదితర అంశాలపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో 75 కిలోమీటర్ల నిడివి గల సముద్ర తీరం, ఆరు బీచ్‌లు, పలు పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్నాయని,వాటి అభివృద్ధిపై సూచనలు,సలహాలు ఇవ్వాలని కోరారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఐఐటీ, ఐజర్, సంస్కృత కళాశాలలు,పలు యూనివర్సిటీలు ఉన్నాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రొఫెసర్ వెంకట్రావు, వినోద్‌గోపాల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ పోటీల విజేత తిరుపతి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. లూయీస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని అంధ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో విశాఖపట్నంపై తిరుపతి జట్టు గెలిచి ట్రోర్నీ విజేతగా నిలిచింది. స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ కల్యాణ మండపంలో శనివారం లూయీస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లూయీస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్‌రెడ్డి, మీనాక్షమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, లేడీస్‌క్లబ్ సభ్యురాలు శ్రీదేవి, వైద్యులు భవాని, పీఓసీ రమణ, అంధుల ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి సాజియతీ తదితరులు పాల్గొన్నారు.


తిరుపతి జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఆకలి ప్రయాణం..!



'బిడ్డల కడుపు నింపేందుకు కన్నవారిని కాలం ఎంతదూరమైనా ప్రయాణం చేయిస్తుంది. ఎంత కష్టమైనా చేయిస్తుంది' అనే దానికి ఈ చిత్రమే నిదర్శనం. శనివారం ఒడిశా రాష్ట్రం బాలాపూర్ నుంచి గాజులమండ్యం, తిరుపతి, తనపల్లి వద్ద ఉన్న ఇటుక బట్టీలలో పనిచేసేందుకు దాదాపు 200 మంది వలస కూలీలు, పిల్లాపాపలతో రేణిగుంట రైల్వేస్టేషన్‌లో దిగారు. మధ్యవర్తి ద్వారా ఒప్పందం కుదుర్చుకున్న వలస కూలీలు వీరు. వీరందరినీ ట్రాక్టర్లలో పదుల సంఖ్యలో ఇటుక బట్టీలకు తరలించారు. - రేణిగుంట, (ఆంధ్రజ్యోతి)

వైభవంగా కళ్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు జరిపించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య ఊంజల సేవను కనుల పండువగా నిర్వహించారు. భక్తులు ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీకేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దండి

ఏర్పేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఎంపీడీవో సౌభాగ్య, అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 15 సైకిళ్ల పంపిణీ



ఏర్పేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 15మంది పేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఉప విద్యా శాఖాధికారి బాలాజీ హాజరయ్యారు. వాటిని విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం జ్ఞానరాధిక మాట్లాడుతూ కుక్కలగుంట, ఆర్వీకండ్రిగ గ్రామల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్లను ఇవ్వడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ డైరెక్టర్ మరుపూరి శేఖర్, ఇన్‌చార్జి తేజోవతి, సంఘసేవకులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుని సేవలో విదేశీ భక్తులు



ఏర్పేడు, జనవరి 4(ఆంధ్ర జ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వర స్వామిని పెంచలకోన కరుణామయి ఆశ్రమ వ్యవస్థాపకురాలు శ్రీదేవి అమ్మవారు దర్శించుకున్నారు. అలాగే విదేశీ భక్తులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో మాజీ చైర్మన్ గిరినాయుడు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాల్యవివాహాల నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత

సత్యవేడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు కిశోరి వికాసం కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉందని, వీటిని గుర్తించి అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో దేవకుమారి, ఎంఈవో చంద్రశేఖర్, ఎంపీహెచ్‌వో సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తెలుగుభాష పరిరక్షణకు టీడీపీ విశేష కృషి

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష కీర్తికి, పరిరక్షణకు టీడీపీ అవిరళ కృషిచేస్తోందని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఇక తెలుగులోనూ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు మాతృభాషపై ఉన్న మమకారంతో తీసుకున్న నిర్ణయం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, టీడీపీ బీసీ విభాగం నాయకులు ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, పేట బాలాజీరెడ్డి, భీమాల భాస్కర్, మణి, మునిరాజాయాదవ్, షేక్ మహబూబ్‌బాషా, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపురం వద్ద సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. సీడీపీవో శాంతిదుర్గ, సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంస్టోర్ యజమాని మోహన్ నవీన్‌కుమార్, సుజాతమ్మ, కోలా సంగీతరావు, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంత నిర్వహణపై పోలీసుల పరిశీలన



రేణిగుంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వారపు సంతను శనివారం పోలీసులు పరిశీలించారు. సంతలో అడ్డదిడ్డంగా దుకాణాల ఏర్పాటుతో రైల్వే గేటు దాటాలంటే వాహనదారులకు తప్పని తిప్పలంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాలతో పోలీసులు పంచాయతీ కార్యదర్శి మణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిరెడ్డి, గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సుధాకర్, టీడీపీ పట్టణాధ్యక్షుడు మహబూబ్‌బాషా, సిబ్బందితో కలిసి సంతను పరిశీలించారు. రోడ్లపై దుకాణాలను తొలగించారు. సంతకు వచ్చే వారు వాహనాలను బయట పార్కింగ్ చేసుకుని సంతలోకి రావాలని సీఐ మురళీకృష్ణ సూచించారు. సంతలోకి నాలుగు చక్రాల వాహనాలను నిషేధించారు. సంతమార్గంలో కాకుండా మరో మార్గంలో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు వెళ్లేలా ఏర్పాటు చేశారు. సంతలో చోరీల నియంత్రణకు పంచాయతీ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

సంతలో వసతులు మెరుగుపరుస్తాం

రేణిగుంట వారపు సంతను మరింత అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సంతను పరిశీలించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. నూతన షెడ్లు, మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బాల్య వివాహాలను అరికడదాం

రేణిగుంట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు అరికడుదామని ఐసీడీఎస్ పీవో కృష్ణమంజరి తెలియజేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై వెలుగు, ప్రగతి, ఏపీఎం, ఏఎన్‌ఎం, సచివాలయ వెల్ఫేర్ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో పిచ్చిరెడ్డి, ఎస్‌ఐ అరుణ్‌కుమార్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

2న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్రాహ్మణ కల్యాణో పాధ్యాయ వివాహ సమాచార కేంద్రముల సంఘం, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వచ్చేనెల 2వ తేదీన బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నారు. తిరుపతిలోని ఇస్కాన్ రోడ్డు, వినాయక నగర్‌లో గల కంచిపాదుక మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించనుననట్లు సంస్థ అధ్యక్షుడు శేషగిరి రావు తెలిపారు. ఈ మేరకు శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. పరిచయ వేదికతో పాటు షష్టిపూర్తి భీమరదశాంతి, సహస్ర చంద్ర దర్శనం, శాంతి హోమం నిర్వహించనున్నట్లు వివరించారు. విశ్వనాథ్, సుబ్బారావు, గోపాల కృష్ణన్, నాగభూషణం పాల్గొన్నారు.

పొజిషన్ పట్టాల పంపిణీ



పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పలువురికి పొజిషన్ పట్టాలను పంపిణీ చేశారు. చిన్నపాండూరు, అంబూరు, వరదయ్య పాళెం, కంచరపాళెం తదితర గ్రామాలలోని ప్రజలు పొజిషన్ సర్టిఫికెట్ల కోసం రెవెన్యూ సదస్సుల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లోని 64 మందికి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ఆది మూలం పొజిషన్ పట్టాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దారు రాజశేఖర్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రసాద్, ఎస్‌ఐ మల్లి కార్జున్, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, కరుణాకర్‌నాయుడు, నంద కిషోర్‌రెడ్డి, దశరథయ్య, రమణయ్య బీజేపీ నాయకులు దిలీప్‌రాయల్, సిద్ధులయ్య, జనసేన నాయకులు తడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ఒకరు మృతి ● గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలు



రమణయ్య మృతదేహం

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్ర జ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో రమణయ్య (52) అనే రైతు మృతిచెందాడు. మరో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు.. పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామానికి చెందిన రమణయ్య షుగర్ మందుల కోసం ద్విచక్ర వాహనంపై శనివారం శ్రీకాళహస్తికి వచ్చాడు. తిరిగి ఇంటికి బయలుదేరాడు. తొట్టంబేడు మండలం పొయ్యకొత్తూరు వద్ద వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం ఎదురైంది. రెండు వాహనాలూ ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. రమణయ్య, మరో వాహనంలోని గుర్తుతెలియని వ్యక్తి ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రమణయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. గుర్తుతెలియని వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

ఇసుక డంప్ స్వాధీనం

నారాయణవనం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తిరువట్యం డ్యాం వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ జయరాములు తెలిపారు. డంప్‌లో 25 ట్రాక్టర్ల ఇసుక ఉందని వివరించారు. ఇసుక డంప్ ఎవరిదో విచారించాలని ఎస్‌ఐని ఆదేశించారు.

మద్యం తాగి వాహనాలను నడిపితే జైలు తప్పదు

ఏర్పేడు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుశిక్ష తప్పదని సీఐ జయచంద్ర హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డ ఏడుగురితో పాటు వారి తల్లిదండ్రులకు ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు.

విద్యా ప్రమాణాలను పెంచడమే ప్రభుత్వ ధ్యేయం

● డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా ప్రమాణాలను పెంపొందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి, మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌బాబు ప్రభుత్వ విద్యాసంస్థలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, ఇశ్రాయేల్‌కుమార్, నరసింహులు, ఎన్‌వీరత్నం, పెంచలయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చంద్రనీల్, ప్రణీత్, వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ జిలానీబాషా, బుజగేంద్రరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరిటౌన్(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని ప్రారంభించిందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు క్రీడల్లో కూడా రాణించేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ తమిళనాడులో ఇలాంటి కార్యక్రమం జరుగుతుందని.. అంతకంటే మిన్నగా పౌష్టికాహారం అందించాలని సంకల్పించి సీఎం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పులికల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రబాబు, బీరం రాజేశ్వరరావు, మగ్గం వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి: ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని పెనల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇంటర్మీడియట్ విద్యార్థులు మధ్యాహ్నభోజన సమయంలో ఇబ్బందిపడాల్సిన పరిస్థితి ఉండేదని చెప్పారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టడంతో విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, నెలవల రాజేష్, పార్థసారధి, పసల గంగాప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, మైలారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు భారతి, భాస్కర్ హాజరై మాట్లాడుతూ బ్రెయిలీ లిపిని కనిపెట్టిన లూయిస్‌ను దివ్యాంగులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం వేదసాయి అనే విద్యార్థికి విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, చైతన్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక భవిత పాఠశాలలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మహేశ్వరి, సహిత విద్య ఉపాధ్యాయులు అయ్యప్పరెడ్డి, నయోమి పాల్గొన్నారు.

పిచ్చాటూరు: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీకి నివాళులర్పించారు. ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజు విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ఐఈఆర్‌పీఎస్ ఉపాధ్యాయులు అందించిన బహుమతులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగలాపురం: నాగలాపురం ప్రభుత్వ పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవోలు బాబయ్య, జనార్ధన్ రాజులుపాల్గొన్నారు.

సత్యవేడు: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీకి నివాళులర్పించారు. ఎంఈవోలు రవి, ఉష, టీచర్లు పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఏర్పేడు: ఏర్పేడు భవిత కేంద్రంలో బ్రెయిలీ దినోత్సవం జరిగింది. టీచర శోభ, ఐఈఆర్‌పీపీ స్వర్ణలత, రమాదేవి, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలో బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఎంఈవోలు సరస్వతి, గున్నయ్య, హెచ్‌ఎం రమణయ్య పాల్గొన్నారు.



తొట్టంబేడులో వేదసాయికి విద్యాసామాగ్రి పంపిణీ



సత్యవేడులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం

పిచ్చాటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని విద్యాధికారులతో కలసి టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్ రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు పద్దురాజు, రవి, వినాయకం, సుమాంజలి తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలకేంద్రలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులనాయుడు, పార్లమెంటరీ రైతు అధ్యక్షులు గోపినాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏర్పేడు: పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్, తిరుపతి ఆర్‌ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ లలితా కరుణాకర్ , ఆంగ్ల అధ్యాపకురాలు వెంకటసుబ్బమ్మ, ఎంపీటీసీ మునిరాజా, ధర్మరాజుల ఆలయ చైర్మన్ అర్జునబాబు, మాజీ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్ద కృష్ణప్ప మొదలియార్, విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణయ్య పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ విద్యార్థినులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు నరసింహయాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెటు ఉపాధ్యక్షులు సుబ్రమణ్యంరెడ్డి, మనోహర్ ఆచారి, హెచ్‌ఎం విష్ణువర్ధిని, ఎంఈవో ఇంద్రదేవి, రంగనాథపాల్గొన్నారు.

సత్యవేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ రాజేష్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించి, విద్యార్థులకు భోజనం అందించారు.. కార్యక్రమంలో ఎంఈవో రవి, ఎంఈవో 2 ఉష, టీడీపీ నాయకులు కృష్ణ చైతన్య, షణ్ముగం, పృథ్వీ, శివానందం, దిలీప్, కార్తీక్, మునిరత్నం అధ్యాపకులు సలీం, శివరామ్, దస్తగిరి, కృష్ణవేణి, గీత తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు మండలకేంద్రంలో జడ్పీఉన్నత పాఠశాల ప్లస్‌లో శనివారం ఇంటర్‌విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దయాకర్, ప్రధానోపాధ్యా యురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో వసతిగృహం కూడా అందుబాటులో వస్తుందని తెలిపారు. సుమరుగా 1,500 అడుగుల పొడవైన ప్రహరీ గోడను, గేటును ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమలో తహసీల్దారు రాజశేఖర్, ఎంపీడీవో ప్రసాద్, ఎస్ ఐ మల్లికార్జున్, ఏఈ నగభూషణం, ఎంఈవో సరస్వతి, గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.







పాపానాయుడుపేట, వరదయ్యపాళెం, సత్యవేడు కళాశాలల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అధికారులు, నాయకులు

పుత్తూరు వార్తలు

విద్యుత్ బిల్లులోనే చెల్లింపులకు క్యూఆర్ కోడ్

పుత్తూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపులు క్యూఆర్ కోడ్‌లతో మరింత సులభమైందని పుత్తూరు డీఈ దేవదానం ఆశీర్వాదం తెలిపారు. జనవరి నెల విద్యుత్ బిల్లుల్లో నెల ఛార్జీలతో పాటు క్యూఆర్ కోడ్ ముద్రించామని అన్నారు. వినియోగదారులు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి బిల్లులు చెల్లించవచ్చని వివరించారు.

లూయిస్ బ్రెయిలీకి నివాళులు



భవిత కేంద్రంలో బ్రెయిలీ జయంతి వేడుకలు

పుత్తూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల (మెయిన్)లోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-1 తిరుమలరాజు మాట్లాడుతూ అంధుల లిపిని కనుగొన్న లూయిస్ ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. అనంతరం అక్కడి విద్యార్థులకు నోటు పుస్తకాలను అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 బాలసుబ్రమణ్యం, హెచ్‌ఎం మురళీకృష్ణ, భవిత ఉపాధ్యాయులు ఆనంద్, సూర్యకుమారి పాల్గొన్నారు.

కిషోరి వికాసంతోనే చిన్నారుల్లో మనోవికాసం



ప్రసంగిస్తున్న కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం-2 కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం కిశోరి వికాసం కార్యక్రమంపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి మున్సిపల్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలికల ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారతకు సమష్టి కృషితో చేయూతనిద్దామని కమిషనర్ పిలుపునిచ్చారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లా డుతూ బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్‌ల పట్ల అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని సీఐ సురేంద్రనాయుడు అన్నారు. బాలికలు అన్ని విధాలా ఎదగడానికి అవసరమైన పటిష్ట భాగస్వామ్యం ఉండాలని ఎంఈవో తిరుమల రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య, గీతాంజలి, అనిత, ఉపాధ్యాయులకు, అధ్యాపకులు, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

పుత్తూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జూని యర్ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించడం హర్షణీ యమని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, ప్రిన్సిపాల్ రఘు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నంనాయుడు, ధనపాల్, ఇస్కాన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణం సురక్షితం : డీఎస్పీ



పుత్తూరు అర్బన్, జనవరి 04(ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పుత్తూరు డివిజన్ డీఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి హెల్మెట్ ధారణ పట్ల పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్పీ ప్రారంభించారు. హెల్మెట్ ధరించి బైక్ నడిపారు. డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల నుంచి 70 మంది పోలీసులు పాల్గొన్నారు. సీఐ సురేంద్రనాయుడు, డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఆగమోక్తంగా మనోన్మణి ఉత్సవం


పురవీధుల్లో ఊరేగుతున్న గొబ్బి దేవత

శ్రీకాళహస్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ధనుర్మాసం పురస్కరిం చుకుని శనివారం ఆగమోక్తంగా మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరం అధిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు.

కోవనూరు పెద్దచెరువు గండికి తాత్కాలిక మరమ్మతులు



కేవీబీపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కోవనూరు పెద్ద చెరువు కల్వర్టు తూములతో సహా కొట్టుకుపోయింది. దానిని రెండు రోజులుగా ఇరిగేషన్ ఏఈ బాబు ఆధ్వర్యంలో మరమ్మతులు పనులు ప్రారంభించారు. శనివారం పూర్తిచేశారు. దీంతో బ్రాహ్మణపల్లి, కోవనూరు, గురుకులకండ్రిగ, గుంటిపేడు తదితర గ్రామాలకు రోడ్డు ఏర్పాటు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయకట్టు ప్రెసిడెంట్ రవి, కిషోర్‌కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కేవీబీపురం ఎస్ఐగా నరేష్



కేవీబీపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం ఎస్ఐగా నరేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఎస్ఐగా పనిచేస్తున్న ఓబయ్య బదిలీపై వెళ్లడంతో ఈయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు రామాంజులనాయుడు, గోపీ నాథ్‌రెడ్డి, సర్పంచ్ బాలాజీ తదితరులు ఆయనకు పూలమాలలు వేసి సత్కరించారు.

గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారుస్తాం



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ రోడ్ల రూపు రేఖలు మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలోని కారణి మిట్ట గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. రోడ్ల నిర్మాణాలలో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథనాయుడు, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, నాయకులు మునిచంద్ర నాయుడు, కార్తిక్‌నాయుడు, ధనయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలయ్యనాయుడి మృతి పార్టీకి తీరని లోటు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలవాయి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాలయ్యనాయుడు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బాలయ్యనాయుడు అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, చెంచురామనాయుడు, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి అధికారులు సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాధారాణి

కేవీబీపురం, జనవరి 4(ఆంధ్ర జ్యోతి): మండలాభి వృద్ధికి అధికారులు సహకరించాలని ఎంపీపీ మునిలక్ష్మి కోరారు. శనివారం ఎంపీపీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు మూడు నెలలుగా చేసిన అభివృద్ధి పనులు, చేయాల్సినవి వివరించారు. అయితే ఓళ్యూరు గ్రామంలో ఖర్చు చేసిన నిధుల వివరాలు ఇవ్వలేదని ఎంపీటీసీ మోహన్‌నాయుడు సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. దీనిపై ఎంపీడీవో రాధారాణి మాట్లాడుతూ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ చేసిన పనులకు లెక్కలు చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మునిరత్నం రెడ్డి, వైఎస్ ఎంపీపీ సత్యవతి, ఎంపీటీలు, సర్పంచులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం

పిచ్చాటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసికృష్ణాపురం పంచాయతీ కొత్త గొల్లకండ్రిగ గ్రామంలో శనివారం ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి చేతుల మీదుగా సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడవి శంకరాపురం ఆయకట్టు ప్రెసిడెంట్ పద్మరాజు, సర్పంచ్ డిల్లీ, జనసేన మండల ఉపాధ్యక్షుడు దూలినేని ప్రేమ్‌బాబు, గిరిబాబు పాల్గొన్నారు.

30 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తాం


సదస్సులో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పిచ్చాటూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగాళ గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ సచివాలయంలో జరిగిన ఈ సదస్సులో తహసీల్దార్ రమేష్‌బాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ సమస్యలను 30 రోజుల్లో పరిష్కరిస్తామని అర్జీదారులకు రశీదులు అందజేశారు. సర్పంచ్ అయ్యప్ప, మాజీ సర్పంచ్ జయచంద్రనాయుడు, ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

నేడు స్థానికుల దర్శన టోకెన్ల జారీ

తిరుమల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెలా మొదటి మంగళవారం స్థానికులకు కల్పించే దర్శన టోకెన్ల కోటాను ఆదివారం జారీ చేయనున్నారు. 7వ తేదీకి సంబంధించిన ఈ టోకెన్లను తిరుపతి మహతి ఆడిటోరియం, తిరుమల బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లోని కౌంటర్ల ద్వారా జారీ చేయనున్నారు. కాగా, ఈ టోకెన్లను పొందేందుకు స్థానికులు డైలామాలో పడ్డారు. ఒకవేళ ఇవి తీసుకుంటే మళ్లీ వైకుంఠద్వార దర్శన టోకెన్లు రావనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

షార్ ఎంఎస్ఏ డీడీగా గోపీకృష్ణ



సూళ్లూరుపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏరియా (ఎంఎస్ఏ) డిప్యూటీ డైరెక్టర్‌గా పి.గోపీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎంఎస్ఏ గ్రూపు డైరెక్టర్‌గా ఉన్న గోపీకృష్ణను పదోన్నతిపై రెండు రోజుల క్రితమే డీడీగా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు తీసుకొన్న ఈయనను సహచర ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు అభినందనలు తెలిపారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం వేదోక్తంగా పూజలు చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామి వారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని రాచగున్నేరి పంచాయతీ పరిధిలో ఉన్న ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సు శిక్షణా ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు అభివృద్ధి చెందడం ద్వారా సమాజ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఈసీఎల్ పరిశ్రమ తిరుపతి నగరంలో వృథాగా వెళ్లే మురుగునీటిని కొనుగోలు చేసి దానిని శుద్ధి చేసి తమ అవస రాలకు వినియోగించుకోవడం అభినంద నీయ మన్నారు. సామాజిక బాధ్యతగా చుట్టుపక్కల మహిళలకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈసీఎల్ ఈడీ సురేష్ కండేవాల్, డిప్యూటీ సీవోవో రాజీవ్ ప్రకాష్, హెచ్‌ఆర్ సీనియర్ జనరల్ మేనేజరు దొరైరాజ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

శ్రీకాళహస్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. పట్టణంలో శనివారం వారు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. పేదల సమస్యల పరిష్కారం కోసం సోమ వారం ఆర్డీవో కార్యాలయ ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, శ్రీరాములు, శివకుమార్, మహిళలు పాల్గొన్నారు.